మరుగునపడిపోయె..

- రూ.79 లక్షలతో.. 12చోట్ల టాయిలెట్స్
- స్వచ్ఛ బోడుప్పల్‌లో భాగంగా నిర్మాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- అందుబాటులోకి రాని మరుగుదొడ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



చెంగిచర్ల జలమండలి ఆఫీసు వద్ద నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ బోడుప్పల్‌లో భాగంగా రూ.79 లక్షలతో 12 చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. నిర్మాణాలు పూర్తయ్యి ఏడాది కావస్తున్నా వాటిని వాడుకలోకి తీసుకురాలేదు. అధికారులు, పాలకవర్గం ఏ ఉద్దేశ్యంతో అయితే ఈ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారో ఆ లక్ష్యం నెరవేరకపోవడంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛ బోడుప్పల్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, పాలకవర్గం ప్రణాళికలు రూపొందిస్తూ బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జలు నిషేదించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేసిన వారికి జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ వాడుకలోకి తీసుకు రాకపోవడంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

స్వచ్ఛ బోడుప్పల్ లక్ష్యంతో..

- 2020 సంవత్సరం జూలై 6వ తేదీన బోడుప్పల్ నగర పాలక సంస్థను స్వచ్ఛ బోడుప్పల్‌గా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం, అధికారులు నడుం బిగించారు. అందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనను నిర్మూలించేందుకు పబ్లిక్ టాయిలెట్స్‌పై చర్చించారు. 2020–21 ఆర్థిక సంవత్సరపు ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించేందుకు పాలకవర్గం ఆమోదించింది.
- 2020 సంవత్సరం డిసెంబర్ 18న నగర పాలక సంస్థ పరిధిలోని వారాంతపు సంతలు, బస్టాప్‌లకు సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధించుటకు పబ్లిక్ టాయిలెట్స్‌కు పాలకవర్గం ఆమోదించింది. వీటిని పట్టణ ప్రగతి నిధుల నుంచి చేపట్టేందుకు పాలకవర్గం ఆమోదించింది.
- 2021 సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీన నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై కౌన్సిల్‌లో పాలకవర్గం చర్చించింది. ఈ నిర్వహణను చేపట్టేందుకు ఈఓఐ(ఎక్స్‌ప్రెసెసిన్ ఆఫ్ ఇంటరెస్ట్) ఏజెన్సీ ద్వారా నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు.
- 2021 సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన నగర పాలక సంస్థ పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను పత్రిక ప్రకటన ద్వారా తక్కువకు కోట్ చేసిన ఏజెన్సీ సెవెన్ స్టార్స్ వారి ద్వారా చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందుకు అయ్యే ఖర్చు రూ.2.50 లక్షలను పరిపాలన ఆమోదం కోసం కౌన్సిల్‌కు సమర్పించారు. తరువాత ఏమైందో ఏమోగానీ వాటి నుంచి అధికారులు గానీ, పాలకవర్గంగానీ పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

ఈ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్..

ఆర్ఎన్ఎస్ కాలనీ బస్టాప్, వీరానగర్ శ్మశానవాటిక, అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం, చెంగిచర్ల జలమండలి కేంద్రం, అన్నపూర్ణ రూ.5 భోజనం సెంటర్ వద్ద, ఎస్‌బీఆర్ కాలనీ, ఎస్సీ శ్మశానవాటిక, యాదవ శ్మశానవాటిక, బోడుప్పల్ నగర పాలక సంస్థ టెర్రస్‌పై, ఎస్ఐఎస్ కాలనీ కమ్యూనిటీ భవనం, సాయినగర్ సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో టాయిలెట్స్ నిర్మించారు.

నిరుపయోగంగా మారాయి



ప్రజల కోసం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ వాడకంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. స్వచ్ఛ బోడుప్పల్‌లో భాగంగా రూ.79 లక్షలతో 12 చోట్ల నిర్మించారు. వాటి నిర్వహణకు ఏజెన్సీ ద్వారా టెండర్ పిలిచారు. అది ఏమైందో ఏమోగానీ ఇప్పటి వరకు వాటిని ప్రజల అవసరాల కోసం వినియోగంలోకి తీసుకురాలేదు. అధికారులు, మేయర్ వెంటనే స్పందించి పబ్లిక్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తీసురావాలి.

– పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్

కీసరగుట్ట జాతరకు ప్రత్యేక బస్సులు

బోడుప్పల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు ఆర్టీసీ చెంగిచర్ల డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఈసు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉప్పల్, ఘట్‌కేసర్ నుంచి ప్రత్యేక బస్సులను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి ప్రతి అరగంటకు, ఘట్‌కేసర్ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఈ బస్సులు నడుస్తాయన్నారు. అంతేగాకుండా ఏదైనా కాలనీ నుంచి 30 మంది ప్రయాణికులు ఉంటే వారి వద్దకే బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.

న్యూవిరాట్ నగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని న్యూవిరాట్ నగర్ కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటించారు. కాలనీలో త్రీఫేజ్ లైన్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. అదేవిధంగా రెండు హైమాస్ట్ లైట్లు, పది విద్యుత్ స్తంభాలకు లైట్లను బిగించాలని ఏఈ ప్రత్యూషకు సూచించారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షుడు సుధీర్‌కుమార్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కుషాయిగూడ: ఇటీవల చిన్న చర్లపల్లి మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మధుర చారిటబుల్ ట్రస్ట్ మెగా మెడికల్ క్యాంప్‌లో కంటి పరీక్షలు చేయించుకున్న 20 మందికి ట్రస్ట్ తరఫున కంటి ఆపరేషన్ చేయించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి గురువారం వారిని పరామర్శించి పండ్లను పంపిణీ చేశారు. నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయాలకు మహా వైభవం..


విద్యుత్ వెలుగుల్లో నేరేడ్‌మెట్ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథ ఆలయం

మల్కాజిగిరి: నేరేడ్‌మెట్‌లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వనాథ ఆలయంలో శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు మహా శివరాత్రి పర్వదిన ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 17వ తేదీన గణపతిపూజ, అఖండ దీపారాధన, ప్రత్యేక అభిషేకాలు, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, 18వ తేదీ శివరాత్రి పర్వదినం రోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సామూహిక అభిషేకాలు, అర్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవకాల సమయంలో పూజా కార్యక్రమాలు, కళ్యాణోత్సవం, 19వ తేదీ అన్నపూజ, అన్నదానం, రాత్రి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఐడీఏ లక్ష్మీనారాయణ కాలనీలో..

రామంతాపూర్: ఐడీఏ లక్ష్మీనారాయణ కాలనీలోని శ్రీఅభయాంజనేయ, రామలింగేశ్వర సహిత సాయిబాబా దేవస్థానం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశామని గురువారం ఆలయ అధ్యక్షుడు పసల లూకాస్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని శివరాత్రి పర్వదినాన్ని ప్రారంభించి ఆ మండపంలో శ్రీభ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు శ్రీధర్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, బ్రహ్మాచారి, మధుబాబు, భిక్షపతిచారి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.


శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం

మెట్రో రైల్‌పై బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాండింగ్

ఉప్పల్: బ్యాంక్ ఆఫ్ బరోడా తమ సంస్థ బ్రాండింగ్ కోసం హైదరాబాద్ మెట్రో రైల్‌ను ఎంచుకుంది. రెండు మెట్రో రైళ్లపై బ్రాండింగ్‌ను గురువారం ప్రారంభించింది. ఈ రైళ్లు నాగోల్ నుంచి రాయదుర్గం వరకు నడుస్తాయి. బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ మోహన్ గుప్త మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే మెట్రో రైల్‌పై బ్రాండింగ్ చేస్తున్నట్లు తెలిపారు. డీజీఎం సీహెచ్ రాజశేఖర్, ఎంపీఎస్ సుధాకర్, గోవింద్ ప్రసాద్, సీపీఎస్ చంద్రశేఖర్ శర్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


నాగోల్ మెట్రో స్టేషన్‌లో తమ బ్రాండింగ్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు


రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం


నాచారంలో ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో బీజేపీ నేతలు

మల్లాపూర్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని మేడ్చల్ జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి అన్నారు. నాచారం బాపూజీనగర్‌లో శక్తికేంద్రం ఇన్‌చార్జి బొల్లం చంద్రమౌళి ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో, అమర్నాథ్ ఆధ్వర్యంలో వీఎస్టీ కాలనీలో ప్రజాగోస– బీజేపీ భరోసా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, బూత్ అధ్యక్షుడు రమేష్, నాయకులు భూపతి యాదవ్, భాస్కర్, నవీన్, ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఉప్పల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను ఉప్పల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిశారు. పార్టీ పటిష్టత, నియోజకవర్గ సమస్యలపై రాగిడితో ఆయన ఆరా తీశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలు, దేశంలో మోదీ ప్రభుత్వం అచ్చే దిన్ పేరుతో ఎలా మోసం చేస్తుందో వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.



తప్పులు లేకుండా సమాచారం అందించండి


కాప్రా సర్కిల్ డీసీని కలిసిన పత్తి కుమార్

కాప్రా: సమాచార హక్కుచట్టం కింద జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుధ్య విభాగానికి సంబంధించిన వివరాలు అందించాలని కాప్రా డివిజన్ వంపుగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ పత్తి కుమార్ కోరారు. ఇదే విషయమై గురువారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య విభాగానికి చెందిన వివరాల కోసం సమాచార హక్కు చట్టం కింద 2022 డిసెంబర్ 22న దరఖాస్తు చేసుకోగా ఈ నెల 7వ తేదీన సంబంధం లేని సమాచారం అందించారని తెలిపారు. ఈ విషయంపై మరోసారి సంబంధిత అధికారికి దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సరైన సమాచారం అందించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

అన్ని కాలనీలో అభివృద్ధి పనులు

మౌలాలి: మౌలాలి డివిజన్ శ్రీవిఘ్నేశ్వర కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమం, బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో అన్ని కాలనీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలకు చేరాలంటే.. పట్టుదలతో చదవాలి

కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని భాష్యం హైస్కూల్‌లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్స్ జెడ్ఈవో మార్కండేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అమరేశ్వర్‌రావు, లిటిల్ చాంప్స్ అడ్మినిస్ట్రేటివ్ మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా భవన్‌ను ఏర్పాటు చేయాలని వినతి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ బ్లాక్–1లో మహిళా సమైక్య భవన్‌ను ఏర్పాటు చేయాలంటూ కోరుతూ గురువారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి మహిళలు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళా భవన్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మహిళా సమైక్య ప్రతినిధులు మదన, సుజాత, రాములమ్మ, శ్యామల, భవానీ ఉన్నారు.

మత్తుకు అలవాటు పడొద్దు

కుషాయిగూడ: విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఓ వ్యక్తి పాఠశాల విద్యార్థులకు గంజాయి అలవాటు చేస్తున్నాడని కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక నేతలు కనకరాజ్‌గౌడ్ గురువారం ఉదయం రెక్కీ నిర్వహించి ఆ వ్యక్తిని పోలీసులకు పట్టించారు. అనంతరం విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు రంగారావు, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.


పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి


మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

పారిశుద్ధ్య కార్మికుల సేవలు భేష్

మౌలాలి: మౌలాలి డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ గురువారం మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ ఇన్‌చార్జి నాగరాజు, ఎస్ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ఫలితమే జీహెచ్ఎంసీలో మౌలాలి డివిజన్ ప్రథమ స్థానంలో దూసుకెళ్తోందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు శివగౌడ్, వెంకటేష్‌నేత, రాము తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

మల్లాపూర్: మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థుల సరికొత్త ఆలోచనలకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమర్నాథ్, సబితా, శేఖర్, ప్రధానోపాధ్యాయులు నెల్సన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

అక్రమ నిర్మాణాలపై గరం గరం

బోడుప్పల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల దందాపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉంది. బోడుప్పల్ ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ ఇంటిని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు బుధవారం కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూ కబ్జాదారులపై కన్నెర్ర జేస్తోంది. అవసరమైతే క్రిమినల్ కేసులకు కూడా వెనకాడబోమని హెచ్చరిస్తోంది.


బోడుప్పల్‌లో..

వీటిపైనే ప్రత్యేక దృష్టి...

జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు 137, 377, 583, 586, 598, 647లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు భూకబ్జాదారులు విక్రయిస్తున్నారు. ఇందులో పలువురి కార్పొరేటర్లు, నేతల ప్రమేయం ఉంది. బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, కబ్జాదారులు 60 నుంచి 80 గజాల ప్లాట్లు చేసి ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇందులో కొన్నింటిని మాత్రమే కూల్చివేసిన రెవెన్యూ యంత్రాంగం మిగతా వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.

- నాగారం మున్సిపాలిటీ పరిధి సర్వే నంబర్ 297లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.
- శామీర్‌పేట్‌లో 45 ఎకరాల సొంత భూమికి పక్కన ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేశారు.
- పీర్జాదిగూడ నగరపాలక సంస్థలో సర్వే నంబర్–199 ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి.

అక్రమ కట్టడాలు...

ఎంసీపల్లిలో 34 ఎకరాల్లో, లింగాపూర్ తండాలో రెండున్నర ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అంకుషాపూర్‌లో ఓ రియల్టర్ 2 కాల్వలకు చెందిన ఎకరం భూమిని ఆక్రమించి 30 ఎకరాల్లో వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నా.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులతోనే కాలం వెల్లదీశారు.

కొర్రెముల్ చైతన్యనగర్‌లో..

ఘట్‌కేసర్: కొర్రెముల్ చైతన్యనగర్‌లో అక్రమ కట్టడాలు చేపట్టారని ఎంపీఓ నందకిశోర్, కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేయించారు. డీపీఓ ఆదేశానుసారం కట్టడాన్ని కూల్చివేయించామని వారన్నారు. అనంతరం బాధితుడు వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ.. కొందరు పాలకవర్గ సభ్యులు డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకు కార్యదర్శిపై ఒత్తిడి చేయించారని ఆరోపించారు. కూల్చివేతతో నాకు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని, దీనికి కార్యదర్శి బాధ్యత వహించాలన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం 17వ డివిజన్‌లో రెండో రోజు నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతీనగర్, సాయిఎన్‌క్లేవ్ ఫేస్–2, వివేకానందనగర్, సిద్ధి వినాయకనగర్, మణికంఠ కాలనీ, ఎస్ఐఎస్ కాలనీ, విజయపురి కాలనీ, రామిరెడ్డినగర్, శివపురి ఫేస్–1, 2 వినాయకనగర్ కాలనీల్లో గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మీరందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, కార్పొరేటర్లు తోటకూర అజయ్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, యూత్ ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్, నేతలు వెంకటేశ్‌గుప్త, పోగుల దీలీప్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, రాపోలు శంకరయ్య, రాపోలు రామస్వామి పాల్గొన్నారు.


గడప గడప పాదయాత్రలో వజ్రేష్‌యాదవ్

దత్తాత్రేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ

కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్‌నగర్ కాలనీలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో గురువారం దత్తాత్రేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కుషాయిగూడ లయన్స్ ఆస్పత్రి చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి, వెట్ ఇండియా కంపెనీ చైర్మన్ సాంబశివరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కిరణ్ కుమార్‌శర్మ, సాయికుమార్ శర్మ, దత్తాత్రేయశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామి, సెక్రటరీ శ్రీనాథ్, ఉపేందర్‌రెడ్డి, శ్రీహరి, పుల్లారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి రిమాండ్

ఉప్పల్: మద్యం మత్తులో కారు నడిపి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మౌలాలి హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన కేదార్ యోగేష్ ముదిరాజ్(30) డ్రైవర్. 15వ తేదీన రామంతాపూర్‌లోని ఓ వైన్ షాపులో స్నేహితులతో కలిసి ఫుల్లుగా మద్యం తాగాడు. మద్యం మత్తులో కారును వేగంగా రామంతాపూర్ లేక్‌వ్యూ బార్ ఎదురుగా ఉన్న గుడిసెలోకి తీసుకెళ్లాడు. గుడిసెలో నిద్రిస్తున్న హరని గోపమ్మ(87), అతడి కుమారుడు రాజు(45)పై నుంచి కారు వెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్న గోపమ్మ గురువారం మృతి చెందగా కుమారుడు కోలుకుంటున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు యోగేష్‌ను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి


మహ్మద్ అబుబక్కర్ సిద్దిక్


సుహానా బేగం

మల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రూ.52 వేల విలువ చేసే 3 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నాచారం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ జానకి వివరాలను వెల్లడించారు. అస్సాం రాష్ట్రానికి చెందిన మహ్మద్ అబుబాకర్ సిద్దిక్(27) సుహానా బేగం(28) ఇద్దరు నాచారం బాబానగర్‌లో అద్దెకు ఉంటూ సహజీవనం చేస్తున్నారు. అస్సాం రాష్ట్రం నుంచి సలాం అనే వ్యక్తి గంజాయిని సరఫరా చేస్తున్నాడు. నాచారం బాబానగర్ నివాసంలో సోదాలుగా చేయగా 3 కిలోల గంజాయి దొరికింది. రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ నరేశ్‌రెడ్డి, నాచారం ఇన్‌స్పెక్టర్ సందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.